# “విత్తువాని గూర్చిన ఉపమాన భావము వినుడి”

## మత్తయి 13:3-10, 18-23; మార్కు 4:2-10, 13-20; లూకా 8:4-9, 11-15, పరిశీలన

నేను ఎక్కువ సమయాన్ని ప్రసంగంలో వెచ్చించినకొలదీ నా ప్రసంగంలోని ప్రాబల్యాన్ని శ్రోతలు తీర్మానిస్తారని నేను నమ్మడం జరుగుతుంది. నేను ఒక ప్రసంగాన్ని ఒక చోట చేస్తే, అచ్చటి ప్రజలు దాన్ని చాలా బాగుందని మెచ్చుకోవచ్చు. అదే ప్రసంగాన్ని నేను మరియొక చోటచేస్తే, అది ఫరవాలేదని గాని, బాగాలేదనిగాని అచ్చటి శ్రోతలు అనవచ్చు. ఒక స్థలంలో ఒక ప్రసంగం అనేక హృదయాలను తాకవచ్చు, మరోచోట, అదే ప్రసంగం ప్రతిస్పందనను కలిగింపవచ్చు. నేను చెప్పే విధానంలో కొంతవరకు మార్పు ఉండవచ్చు అని నేను ఒప్పుకున్నా, ఆ గొప్ప వ్యత్యాసం శ్రోతలలో ఉండవచ్చు. సువార్త విజయంలో శ్రోతల పాత్రను నొక్కి చెప్పడానికి ఒక ఉపమానాన్ని తెలియజేశారు.[1]

### ఉపమానం

### (మత్తయి 13:3-9; మార్కు 4:2-9; లూకా 8:4-8)

“ఇదిగో విత్తువాడు విత్తుటకు బయలు వెళ్లెను” అంటూ ప్రభువు ప్రారంభించారు (మత్తయి 13:3).

**త్రోవ ప్రక్కన[2] నేల: కఠినమైనది**

“వాడు విత్తుచుండగా కొన్ని విత్తనములు త్రోవ ప్రక్కను పడెను” (మత్తయి 13:4ఎ). ఆ కాలంలోని పాలస్తీనాలో చేలకు కంచెలు ఉండేవి కావు. త్రోవలు చేలలో గుండా ఉండేవి. ఈ త్రోవలు గట్లుగా వేయబడి, ఆ చేలలో గుండా నడిచేవారి పాదాలచే అవి కఠినమై ఉండేవి. విత్తనం ఆ నేలలో నాటుకునేది కాదు. గనుక అది భూతలం మీద కన్పిస్తూ ఉండేది. తత్ఫలితంగా, “త్రొక్కబడెను గనుక, ఆకాశ పక్షులు వాటిని మ్రింగి వేసెను” (లూకా 8:5బి).[3]

**రాతినేల: లోతులేనిది**

“కొన్ని చాల మన్నులేని రాతినేలను పడెను” (మత్తయి 13:5ఎ). అడుగున ఉన్న రాయి మట్టిచేత పైపైననే కప్పబడింది.[4] పాలస్తీనాలోను, కొండలమయమైన దేశాల్లోను

ఈలాటి చోట్లు చాలా సాధారణంగా ఉంటాయి. త్రోవ ప్రక్కన నున్న నేల ఏలాటిదో ఈ నేల కూడ ఆలాటి కఠినమైనదే కాని, అది మంచి నేలగా గోచరిస్తుంది.

ఇలాంటి నేలలో విత్తనం పడినప్పుడు, అది భూమిలో కొంత మాత్రమే నాటుకొని పెరగడం మొదలెడుతుంది. ఏమైనా ఆ మట్టి ఎంత పలుచగా ఉందంటే మొక్కలు లోతుగా అందులో వేళ్ళను నాటుకోలేవు: "మన్ను లోతుగా ఉండనందున అవి వెంటనే మొలిచెను సూర్యుడు ఉదయించినప్పుడు అవి మాడి వేరు లేనందున ఎండిపోయెను" (5బి వ.). తత్ఫలితంగా "సూర్యుడు వెలిగినప్పుడు వాటి వేళ్ళు కూడా నాటుకోలేదు కనుక ఆ ఎండకు[మరియు "చెమ్మలేదు" కనుక; లూకా 8:6] అవి ఎండిపోయాయి" (మత్తయి 13:6).

### ముండ్లపొద: విభాగింపబడినది

"కొన్ని ముండ్లపొదలో పడెను" (మత్తయి 13:7ఎ). ఇది మంచి సారవంతమైన భూమి. కాని అది ముళ్ళతో నిండి ఉంది. పాలస్తీనాలో పదహారు రకాలైన ముండ్ల చెట్లున్నట్టును, కొన్ని చోట్ల అవి ఎంత దట్టంగా పెరుగుతాయంటే, గుర్రం మీద ఒకడు వాటిగుండా వెళ్లవీలుకానంత దట్టంగా ఉంటాయి.[5]

ముండ్లతుప్పల పై భాగము కత్తిరించబడినందున. ఆ నేల మంచిగా కన్పించే అవకాశముంది – కాని నేల లోపల వేళ్ళు మిగిలిపోయి ఉంటాయి. నేను చిన్నవాడిగా ఉన్నప్పుడు, తోటలో పారతో త్రవ్వమని మా నాయన చెప్పాడు. పైపైననే కలుపు నేను చెక్కానని ఒప్పుకుంటాను. ఆ విధంగా తోటలో కలుపు లేనట్టు కన్పిస్తుంది. అయితే పని ఎక్కువ కాలం పట్టలేదు. దానికి ఫలితంగా తిరిగి తోటను త్వరలోనే పారతో చెక్కవలసి వచ్చింది!

ఈ నెలలో విత్తనం మొలిచి పెరిగింది వేళ్ళుకూడా పెరిగాయి. కాని ముళ్లు కూడా వాటితో ఎదిగాయి (లూకా 8:7). తత్ ఫలితంగా, "ముండ్లపొదలు ఎదిగి వాటిని అణచివేసెను" (మత్తయి 13:17బి). చాలా కాలంగా విస్తృతమైన ఒక ఆధారం గుండా ఈ సత్యాన్ని సేకరించాను: "నేల కొంత పరిధిలో చెట్లు పెరుగుటకు ఆధారంగా ఉంటుంది, మరియు సజీవంగా ఉన్న ప్రతి కలుపుమొక్క అంటే, ధాన్యపు గడ్డిపోచ యొక్క అణచివేతయని అర్థం." ముండ్లు మొక్కలను చంపలేదు. రాతి నేలవలెనే యిక్కడ కూడా మొక్కలు ఎదిగాయి, అయితే అవి పొట్టిగా పెరిగాయి. వాటికి (చిగుళ్లు) తలలు పెరిగాయి.[6] అయితే ఆ తలలు శూన్యంగా మిగిలాయి. "గనుక అవి ఫలించలేదు" (మార్కు 4:7).

### మంచినేల: మెత్తని, లోతైన, శుభ్రమైనది

"కొన్ని మంచి నేలను పడెను" (మత్తయ 13:8ఎ). ఇది మంచి, సారవంతమైన భూమి విత్తనాన్ని అంగీకరించడానికి సిద్ధపరచబడింది. ఇది తక్కిన నేలలకు భిన్నమైనది. త్రోవ ప్రక్కన నేల గట్టిపడినది, కాని యిది మెత్తనిది. రాతినేల లోతులేనిది, కాని యిది లోతైనది. ముండ్ల పొదలు కలుపుతో నిండియున్నవి. కాని యిది శుభ్రంగా ఉంది.

ఇక్కడ ఏ జోక్యం లేకుండ విత్తనం దిగిపోయి ఎదుగుతుంది. దానికి ఫలితమేమి? "కొన్ని మంచి నేలను పడి, ఒకటి నూరంతలుగాను, ఒకటి అరువదంతలుగాను, ముప్పదంతలుగాను ఫలించెను" (8బి వ.),

ప్రభువు ఈ ఉపమానం చెప్పిన తరువాత, "చెవులుగలవాడు వినును గాక అని చెప్పెను" (9 వ.) ఇది విని మరచిపోయే కథ కాదని ఆయన నొక్కి చెప్పారు. దీని భావం గ్రహించుడని ఆయన తన శ్రోతలకు పిలుపునిచ్చారు.

## వర్తింపు
## (మత్తయి 13:10, 18-23; మార్కు 4:10, 13-20; లూకా 8:9, 11-15)

శిష్యులు ఆయన యొద్దకు వచ్చి, ఆయన ఉపమానరీతిగా ఎందుకు బోధించారోయని (మత్తయి 13:10), ఈ ఉపమాన భావమేమిటాయని ప్రభువును అడిగారు (లూకా 8:9). అప్పుడు క్రీస్తు దాన్ని వారికి వివరించుతూ యిలా ఆరంభించారు: "విత్తువాని గూర్చిన ఉపమాన భావము వినుడి" (మత్తయి 13:18).

నేలలను గూర్చిన ఆయన వివరణకు వెళ్లకముందు, విత్తనము, విత్తువాడు, పొలము అనే వాటి ప్రాముఖ్యతను కొద్దిక్షణాలు మనం గుర్తించవలసియుంటుంది. మొదటిగా, విత్తనాన్ని గూర్చి ఆలోచించుదాం. "ఈ ఉపమాన భావమేమనగా, విత్తనము దేవుని వాక్యము" అని ఆయన అన్నారు (లూకా 8:11). మరల ఆయన, "విత్తువాడు వాక్యము విత్తుచున్నాడు" అని అన్నారు (మార్కు 4:14). విత్తనము – "శాశ్వతమగు జీవముగల దేవుని వాక్యము" (1 పేతురు 1:23); విత్తువాడు వాక్యమును ప్రకటించువాడు. పౌలు సువార్త ప్రకటనను గూర్చి మాట్లాడుతూ, "నేను నాటితిని" అని అన్నాడు (1 కొరింథీ. 3:6ఎ). పొలము సంగతి ఏమిటి? ఇది మానవ హృదయం. హృదయం దేవుని వాక్యాన్ని గ్రహించే సామర్థ్యం కలిగియుంది. మంచినేల నుండు (విత్తనమును పోలిన) వారెవరనగా, "యోగ్యమైన మంచి మనస్సుతో వాక్యమును అవలంభించువారు" (లూకా 8:15).

ఉపమాన ముఖ్య సందేశమిది: ప్రతి సందర్భంలోను విత్తువాడును విత్తనమును ఒకే విధంగా ఉన్నాయి; వ్యత్యాసం నేలలో ఉంది.[7] విత్తనాన్ని స్వీకరించడానికి ప్రతిదీ విభిన్నమైన పరిస్థితిలో ఉంది. గనుక ప్రతి సంఘటనలోను ఫలితం వేరుగా ఉంది. "నా హృదయపు స్థితి ఏమి? నేను వాక్యాన్ని ఎలా అంగీకరిస్తున్నాను?" అని ప్రతి ఒక్కరు తన్నుతాను ప్రశ్నించుకోవలసి ఉంటుంది.

నాలుగు విధములైన హృదయ నేలలను గూర్చిన ప్రభువు వివరణను చూద్దాం.

### త్రోవ ప్రక్కన నేల: కఠినపరచబడిన హృదయం

త్రోవ ప్రక్కనున్న నేల కఠిన హృదయానికి ప్రాతినిధ్యం వహిస్తుంది – పరపక్ష ద్వేషము, అలక్ష్యమనే వాటిచే త్రొక్కబడి "పాపమువలన కలుగు భ్రమచేత"

కఠినపరచబడుతుంది (హెబ్రీ. 3:13). సువార్త ప్రకటించడానికి నీవెప్పుడైనా ప్రయత్నించియుంటే, సువార్తయందు అభిలాషలేని జనులను నీవెప్పుడైనా సంధించియుండవచ్చు. 1 కొరింథీ. 2:14లో పౌలు ఈలాటి వ్యక్తులను గూర్చి మాట్లాడుతున్నాడు: "ప్రకృతి సంబంధమైన మనుష్యుడు దేవుని ఆత్మ విషయములను అంగీకరింపడు, అవి అతనికి వెఱ్ఱితనముగా ఉన్నవి, అవి ఆత్మానుభవము చేతనే వివేచింపదగును గనుక అతడు వాటిని గ్రహింపజాలడు." వారు సత్యమును ప్రేమతో అవలంభింపరు (2 థెస్స. 2:10). వాక్యమను భీజము వారి హృదయంలోనికి దూరదు.

ప్రభువు యిలా అన్నారు: "ఎవడైనను రాజ్యమును గూర్చిన వాక్యము వినియు గ్రహింపకయుండగా, దుష్టుడు వచ్చి వాని హృదయములో విత్తబడిన దానిని యెత్తికొనిపోవును; త్రోవ ప్రక్కను విత్తబడినవాడు వీడే" (మత్తయి 13:19). త్రోవ ప్రక్కన విత్తనాలను పక్షులు ఎలా తినివేస్తాయో అలాగే కఠిన హృదయంలోనుండి అపవాది వాక్యాన్ని ఎత్తుకొనిపోతాడు. ఎలాగు? అది ఎలాగంటే, వెంటనే అతని హృదయాన్ని అనేకమైన యితర ఆలోచనలతో నింపివేస్తాడు. సాతాను ఈ పనిని ఎందుకు చేస్తాడు? వారు విని "రక్షణపొందకుండునట్లు" వాడు ఈ పని చేస్తాడు (లూకా 8:12). దేవుని వాక్యము వినుటవలన విశ్వాసము కలుగును (రోమా 10:17). వాక్యము విని విశ్వసించడం అపవాదికి యిష్టముండదు. నరకంలో తనతో ఎంత మంది జనులు ఉంటే వాడు అంతగా యిష్టపడతాడు.

ఈ మాటలు చదివే ఎవనియందైనా ఈలాటి హృదయం ఉండే అవకాశముంటుందా? వాక్యాన్ని అంగీకరించడానికి ఎవరైనా తన హృదయాన్ని కఠినపరచుకునే వీలుందా? బైబిలు యిలా విన్నవించుకొంటుంది: "నేడు మీరాయన శబ్దము విని ... మీ హృదయములను కఠినపరచుకొనకుడి" (హెబ్రీ. 3:7, 8; 4:7బి). కాని, "మీ ఆత్మలను రక్షించుటకు శక్తిగల వాక్యమును సాత్వికముతో అంగీకరించుడి" (యాకోబు 1:21). విత్తనాన్ని పోగొట్టుకొనడం జీవితాన్ని పోగొట్టుకొనడమే ఔతుంది ఎందుకంటే ఆత్మసంబంధమైన జీవితం ఆ విత్తనంలో ఉందని జ్ఞాపకముంచుకో!

**రాతినేల: లోతులేని హృదయం**

అప్పుడు ప్రభువైన యేసు రాతినేల భావాన్ని యిలా తెలిపారు: "రాతి నేలను విత్తబడిన వాడు వాక్యము విని వెంటనే సంతోషముతో దాని నంగీకరించువాడు" (మత్తయి 13:20). రాతినేల లోతులేని హృదయాన్ని చిత్రిస్తుంది. ఒక వేళ నీవు ఈలాటి వ్యక్తిని సంధించి యుండవచ్చు: అతడు వాక్యాన్ని సంతోషంతో అంగీకరిస్తున్నట్టు కన్పించాడు. అతడు వెంటనే సువార్తకు లోబడతాడు. అందుకు మనమందరం ఆనందించాం. అతడు అంత తొందరలోనే క్రైస్తవుడవ్వడం ఆశ్చర్యం కాదా? అయితే అంతే తొందరలో అతని అభిలాష కూడా చచ్చిపోతుంది. దానితో మన హృదయాలు పగిలిపోయాయ్. త్వరలో మొలకెత్తి లేచిన మొక్కవలె ఈ వ్యక్తి ఉన్నాడు. ఆ మొక్కకు లోతైన మన్నులేదు. ఏ కారణాన్ని బట్టియేగాని, ఈ వ్యక్తి సత్యమందు స్థిరపరచబడలేదు.[8] క్రైస్తవ్యంలోని నిజమైన ప్రాముఖ్యము ఏమో అతడు గ్రహించలేకపోయాడు.

ప్రభువు వారి వర్ణననుబట్టి, “అతనిలో వేరు లేనందున అతడు కొంతకాలము నిలుచునుగాని,” (మత్తయి 13:21ఎ). అతడు కొంతకాలము “సహించును” అని KJV అంటుంది. మొదటి నేలను పోలినవానికంటె యితడు శ్రేష్ఠంగా కన్పిస్తాడు, కాని “అంతమువరకు” నిలిచియుండేవాడు కాదు (మత్తయి 10:22). ఇంతకు (కడకు) ఫలితం ఒక్కటే. “వాక్యము నిమిత్తము శ్రమయైనను హింసయైనను కలుగుగానే అభ్యంతరపడును” (మత్తయు 13:21). లోతుగా వేళ్ళు పాతుకొనిపోని మొక్క సూర్యరశ్మికి ఎండిపోయినట్టే, ఈ వ్యక్తియు శ్రమ లేక హింస కలిగినప్పుడు ఎండి పోతాడు. సూర్యరశ్మి లోతుగా పాతుకొని పోయిన చెట్టును బలపరచుతూ, లోతులేని చెట్టును ఎండిపోజేసినట్టే, హింస స్థిరపరచబడిన క్రైస్తవుని బలపరచుతుంది,[9] పైపైననే క్రైస్తవుడైన వానిని బలహీనుని కావిస్తుంది.[10]

ఈ ఉపమానంలో వెంటనే అనే పద ప్రయోగాన్ని గమనించు: “వెంటనే సంతోషముతో దాని నంగీకరించువాడు.” వాక్యము నిమిత్తము శ్రమయైనను హింసయైనను కలుగగానే “– అంటే (వెంటనే” తెలుగులో గుప్తం చేయబడింది). కిరీటానికి ముందు సిలువ రావడం అతడు కనుగొనినప్పుడు, సిలువను తప్పించుకొనడానికి కిరీటాన్ని వద్దనుకుంటాడు.

ఇది నిన్ను వర్ణించడం లేదని నేను అనుకుంటాను. నీవు ఎంతగా పాతుకుని పోయావో పరీక్షించుకోవాలంటే, హింసకు నీవు ఎలా స్పందిస్తావో చూచుకో. గాఢంగా అనుసరించని క్రైస్తవుడు దేవుని అనుసరించడంకంటె దేవుని తిరస్కరించడం సులభంగా ఉన్నంతవరకు. క్రీస్తుని అనుసరించే వానిగా ఉండడం కఠినం కానంతవరకు “ఆరోగ్య వంతునిగానే” కన్పిస్తాడు:

- బైబిలు స్టడీకి వెళ్లడం కంటె పడకమీద ఉండడం సులభంగా ఉండేంతవరకు.
- ఆరాధనకు వెళ్లడం కంటె చేపలుపట్ట వెళ్లడం సులభంగా ఉండేంతవరకు.
- సువార్త పంచుకునేదానికంటే మౌనంగా ఉండడం సులభంగా ఉండేవరకు.
- లోకానికి వెలుగుగా ఉండడం కంటె లోకంతో కలిసిపోవడం సులభంగా ఉండేవరకు.
- సత్యం కొరకు నిలబడేదాని కంటే తప్పును గుర్తించకపోవడం సులభంగా ఉండేవరకు.[11]

వాక్యము నిమిత్తము శ్రమయైనను హింసయైనను కలిగినప్పుడు నీ ప్రతిచర్య ఎలా ఉంటుంది? నీవు లోతులేని క్రైస్తవుడుగా జీవిస్తున్నట్టయితే, దేవుని వాక్యమందు నీ వేళ్ళు లోతుగా పాతుకొనిపోయేలా తిరిగి సమర్పించుకోవాలని నేను నిన్ను అర్థిస్తున్నాను.

### ముండ్లపొద: విభాగింపబడిన హృదయం[12]

తరువాత మనం ముండ్లతుప్పలతో నిండిన నేల యొద్దకు వస్తాం. ఈ విధమైన

నేలను గూర్చి ప్రభువు యిలా వర్ణిస్తున్నారు: "ముండ్లపొదలలో విత్తబడినవాడు వాక్యము వినువాడేగాని ఐహిక విచారమును ధనమోసమును ఆ వాక్యమును అణచివేయును గనుక వాడు నిష్ఫలుడవును" (మత్తయి 13:22).

నా మట్టుకు యిది, ఈ ఉపమానంలో వర్ణింపబడిన బహు దుఃఖకరమైన సంగతి. చిత్రింపబడిన నేల సారవంతమైనదియు ఫలవంతమైనదియునై యున్నప్పటికిని, ఎంతో వాగ్దానంతో కూడినదిగా ఆ హృదయం కన్పించియు ఫలభరితం కాకపోవడం దుఃఖకరమే. అతడు కఠిన హృదయుడు కాదు, లోతులేనివాడు కూడా కాదు; శీలములో సారముంది, వ్యక్తిత్వంలో లోతూ ఉంది. ఫలభరితుడగు దేవుని బిడ్డగా రూపొందే శక్తి ఉంది. అయితే విషాధకరంగా, అతని హృదయము లోకసంబంధమైన "ముండ్లతో" కూడినదైయుంది. చిన్నవాడనైయున్నప్పుడు నేను పారతో చెక్కినట్టు, ఉపరితలం మీదనే అవి కనబడకపోవచ్చు – అయితే లోకంతో అతనికున్న సంబంధం హృదయంలో యింకను ఉంది.

ఈ వ్యక్తి క్రైస్తవుడైనప్పుడు, నిజమైన మార్పుకు సంబంధించిన ప్రతి సూచనయు కలిగియున్నాడు. అయినా, తన హృదయంలో క్రీస్తుకు ప్రధానమైన స్థానం యివ్వడానికి బదులు (మత్తయి 6:33) ఐహిక విచారంతో అతడు నింపబడియున్నాడు (13:22 KJV), "ధన మోసంతో నిండియున్నాడు" (22 వ.). "జీవన సంబంధమైన విచారముల చేతను" (లూకా 8:14), "మరి ఇతరమైన అపేక్షలును లోపలికి చొచ్చి" (మార్కు 4:19 KJV) అణచి వేయబడ్డాడు. ఆ నేల కొంతవరకు మట్టుకే వృక్షాలకు పోషణ యివ్వగలదు, అలాగే మానవ హృద అపేక్ష కూడా: "దేవునికిని సిరికిని దాసుడవుగా ఉండలేవు" (మత్తయి 6:24బి) – లేదా దేవుని మరియు భోగాన్ని, లేదా దేవుని మరిదేనినైనా.

అతని హృదయ స్వభావంవలన, అతనిలోనున్న వాక్యము అణచివేయబడింది. అది చంపబడలేదు లేక నశింపజేయబడలేదు గాని కేవలం అణచివేయబడింది. తమ ప్రక్కనున్న మొక్కల సారాన్ని ముండ్లపొద లాగివేసేది వాస్తవం. గనుక ఆత్మసంబంధమైన అతని అభిలాష ఎండి పోయింది. అతనికున్న సామర్థ్యంతో, గొప్ప క్రైస్తవుడుగా ఉండే అవకాశం అతనికి ఉన్నదిగాని, అతనికున్న ఒకే అభిలాష గొప్ప వ్యాపారి లేక గొప్ప రాజకీయవేత్త లేక ఏదోఒక గొప్ప వ్యక్తిగా ఉండాలనే అతడు కోరుకుంటున్నాడు.

తత్ ఫలితంగా, ప్రభువు సేవలో అతడు నిష్ఫలుడయ్యాడు. ఈ వ్యక్తులు "పరిపక్వముగా ఫలింపనివారు" అని క్రీస్తు అన్నారు (లూకా 8:14). గింజలేని వడ్లు ధాన్యంలా కన్పించినట్టే, యిట్టివారికి క్రైస్తవ్యం యొక్క ఆచారాలుంటాయి, అతని జీవితం నిజంగా ఒక ఖాళీ గవ్వగా మిగిలిపోతుంది. అతడు క్రీస్తు కొరకు ఏ ఫలమును పలించడు.[13] కడకు, అతడు లోకాన్ని సంపాందించుకొని తన ఆత్మను పోగొట్టుకున్న వాడుగా నిలుస్తాడు (మార్కు 8:36).

మరల, స్వయం పరీక్షకు యిది సమయం. ఈ సమస్యలలో ఏదైనా, ఆత్మసంబంధమైన నీ సారాన్ని, శక్తిని పీల్చివేశాయా?

(1) లోకపు చింతలు, విచారములు. ప్రభువునకు సంపూర్ణంగా అప్పగించకుండేలా అల్పమైన విషయాలు మనలను దూరం చేస్తున్నాయా? మార్తవలె మనము, "అనేకమైన పనులను గూర్చి విచారము కలిగి తొందరపడు" చున్నామా? (లూకా 10:41). నిజంగా

అవసరమైనదేదో దాన్ని మరచిపోయామా (లూకా 10:41, 42)?

(2) ధనమోసము. ఆస్తిని సమకూర్చుకొనడమే విశేషం అనే ఆలోచనతో మోసగించబడ్డామా? మనకు కొద్దిగా అవసరం–అదికూడా కొంతకాలం మట్టుకే. మనం "ముందు ఉండాలనే" కోర్కెతో జీవితంలో ప్రధానమైన, ప్రాముఖ్యమైన వాటిని అలక్ష్యం చేయకుందాం.

(3) భోగములు, ఆశలు. ఆత్మసంబంధమైన మన జీవితాన్ని లౌకికత కాల్చివేసే అవకాశం లేదా? లోకం మన హృదయంలో నివాసం చేస్తుందా? దైవ మానవుల సేవ చేయడంలో కాకుండ "సరదాగా" జీవించడంలో ఎక్కువ కాలం గడుపుతున్నామా?

మనలో ఎక్కువమంది విభజింపబడిన హృదయం అనే లెక్కలో పడిపోతాం. దేవుని కొరకు ఉపయోగింపబడే తలాంతులు, దాగియున్న శక్తి మనకున్నాయి; కాని ఆయన కొరకు ఉండవలసిన మన ప్రేమను యితర అభిలాషలతో ముంచివేయబడదానికి సమ్మతిస్తాం. ప్రభువు మీద మన హృదయాన్ని కేంద్రీకరించేలా నిలుపుకుందాం: "హృదయశుద్ధిగలవారు ధన్యులు" అని ఆయన అన్నారు (మత్తయి 5:8ఎ). పౌలు యిలా వ్రాశాడు: "మీరు క్రీస్తుతో కూడ లేపబడినవారైతే పైనున్న వాటినే వెదకుడి అక్కడ క్రీస్తు దేవుని కుడిపార్శ్వమున కూర్చుండియున్నాడు. పైనున్నవాటి మీదనేగాని, భూసంబంధమైన వాటి మీద మనస్సు పెట్టకుడి" (కొలస్సీ. 3:1, 2).

**మంచినేల: నిష్కపటమైన మంచి హృదయం**

చివరికి మనం "మంచినేల" వద్దకు వచ్చాం. "యోగ్యమైన మంచి మనస్సుగా" ప్రభువు దీన్ని అభివర్ణించారు (లూకా 8:15). వారి హృదయాలు కఠినమైనవి కావు; లోతులేనివి కావు, లేక విభాగింపబడినవీ కావు. వారు "వాక్యము విని, దానిని అంగీకరిం"చువారు (మార్కు 4:20). వాక్యమును "గ్రహించు" టకు అవసరమైన శ్రమ (శద్ధ) తీసికొనేవారు (మత్తయి 13:23). వాక్యమును అంగీకరించినమీదట, దానిని "అవలంభించి" ఫలించువారు. కీర్తన రచయిత వర్ణించిన మనిషిని పోలి వారున్నారు: వారు "యెహోవా ధర్మశాస్త్రమునందు అనందించు" వారు (కీర్తన. 1:2).

ఆలాటి హృదయంలో వాక్యము మొలిచి, ఎదుగుతుంది, చివరకు ఫలిస్తుంది. అట్టివారు "వాక్యము విని గ్రహించువాడు; అట్టివారు సఫలులై యొకడు నూరంతలుగాను ఒకడు అరువదంతలుగాను, ఒకడు ముప్పదంతలుగాను ఫలించుననెను" (మత్తయి 13:23). వెర్వేరు నేలలకు వెర్వేరు లోనణగియున్న శక్తులున్నాయి, అందునుబట్టి ఫలశాతము వేరుగా ఉంటుంది – నూరంతలు, అరువదంతలు, ముప్పదంతలు మంచి ఫలితాలే. కడకు, విత్తనాలు విత్తడంలో కాంక్షించిన ఫలితాలు వచ్చాయి: పరిపక్వమైన క్రైస్తవుడు తన జీవితంలో ఆత్మసంబంధమైన ఫలాలను ఫలిస్తాడు!

మరోసారి, మనలో ప్రతి ఒక్కరు తమవంక చూచుకుందాం. "నాకు నిష్కపటమైన మంచి మనస్సు, హృదయం ఉందా? దేవుని వాక్యాన్ని నేను ఆసక్తితో అన్ని విషయములో (ప్రతి విషయంలో) ఆయనకు లోబడే కోర్కె నాకుందా?" అని ప్రతి ఒక్కరం పరీక్షించు కుందాం.

ప్రశ్నలకు జవాబిచ్చే ఒక విధానం “ఫలాలను పరీక్షించుకొనడం.” వారి ఫలముల వలన మీరు వారిని తెలిసికొందురని ప్రభువే అన్నారు (మత్తయి 7:16ఎ). మన జీవితాల్లో ఫలాలు ఫలిస్తున్నామా? మన జీవితాలలో ఫలముల కొరకు ఎదురుచూచునట్లుగా చాలినంత కాలము మనము దేవుని పిల్లలమైయున్నామా?[14] క్రీస్తు ప్రభువు యిలా అన్నారు: “మీరు బహుగా ఫలించుటవలన నా తండ్రి మహిమపరచబడును: ఇందువలన మీరు నా శిష్యులగుదురు” (యోహాను 15:8). దేవుని కొరకు ఫలములు ఫలించునట్లు మనము క్రీస్తుతో జతచేయబడినట్టు పౌలు వ్రాశాడు (రోమా 7:4). “... ప్రతి సత్కార్యములో సఫలులగుచు, దేవుని విషయమైన జ్ఞానమందు అభివృద్ధిపొందుచు ... అన్ని విషయములలో ప్రభువును సంతోషపెట్టునట్లు, ఆయనకు తగినట్టుగా నడుచుకొనవలెననియు” (కొలస్సీ. 1:10).

“ఫలించుచు” అంటే అర్థమేమి? “ఫలితము లేక ఫలము” అంటే, “ప్రతిఫలం.”[15] దేవుని కొరకు “ఫలములను ఫలించడమంటే” వాక్యం ఏ విధమైన ఫలితాలను ఆశిస్తుందో అట్టివి మన జీవితాలలో రావడమే. వాక్యం యొక్క ఫలితాలను జనులు మన జీవితాలలో అనుభవపూర్వకంగా చూడగలగాలి. మన ప్రవర్తన క్రీస్తు శీలాన్ని చూసే ఫలాన్ని ఫలించాలి. ఇతరులను ఎక్కువైన దయతో చూచేటప్పుడు, సహాయం చేసేటప్పుడు మనం ఫలాలను ఫలిస్తున్నాం. నమ్మకమైన ఆరాధనలో, అభివృద్ధిచెందుతున్న సేవలో ఆత్మసంబంధమైన మన ప్రేమ విదితమైయున్నప్పుడు మనం ఫలాలను ఫలిస్తున్నాం. మనం సువార్తను పంచుకొంటూ యితరులను ప్రభువు వద్దకు మళ్లించడంలో మనం ఫలాలను ఫలిస్తాం.[16]

మరల ప్రభువు మాటలను తిరిగి చెప్పుదాం. “చెవులుగలవాడు వినును గాక” (మత్తయి 13:9). గ్రహించుటకు పిలుపునివ్వడంగా యిది పనిచేయడం మాత్రమేగాక, మన పాఠానికి సంగ్రహంగా కూడ పనిచేస్తుంది: క్రీస్తు ప్రభువు మాటలు విని అంగీకరించేలా అనుసరించు; నీవు దీవించబడతావు!

## ముగింపు

గతంలో నీవీ మాటలకు ఎలా స్పందించావో నాకు తెలియదు, కాని యాకోబు సూచించిన హృదయపు స్వభావముతో నీవు దాన్ని అంగీకరించేలా ప్రోత్సహిస్తున్నా:

> అందుచేత సమస్త కల్మషమును, విజృంభించుచున్న దుష్టత్వమును మాని, లోపల నాటబడి మీ ఆత్మలను రక్షించుటకు శక్తిగల వాక్యమును సాత్వికముతో అంగీకరించుడి. మీరు వినువారు మాత్రమై యుండి మిమ్మును మీరు మోసపుచ్చుకొనకుండ, వాక్యప్రకారము ప్రవర్తించువారునై యుండుడి (యాకోబు 1:21, 22).

ఇక్కడ ప్రాముఖ్యమైన కొన్ని లేఖన భాగాలున్నాయి. వాటితో నీకు పరిచయం ఉండవచ్చు, ఉండకపోవచ్చు:

> నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును; నమ్మని వానికి శిక్షవిధింపబడును (మార్కు 16:16).

మీరు మారుమనస్సుపొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసు క్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు (అపొ. 2:38).

గనుక నీవు తడవు చేయుట ఎందుకు? లేచి ఆయన నామమునుబట్టి ప్రార్థనచేసి బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగివేసికొనుమని చెప్పెను (అపొ. 22:16).

… మరణమువరకు నమ్మకముగా ఉండుము. నేను నీకు జీవ కిరీటమిచ్చెదను (ప్రకటన 2:10).[17]

నీకు నిష్కపటమైన మంచి హృదయం ఉండాలని నా ప్రార్థన – ఈ లేఖన భాగాలను విని, వాటిని అంగీకరించి, గ్రహించి, లోబడాలని, మరియు నీ హృదయంలో వాటిని స్థిరముగా నిలుపుకోవాలని ఆశిస్తున్నాను.

## నోట్సు

ఒక విధంగా ఈ ప్రసంగంలోని వర్తమానం సులభమైనది. విత్తువాని ఉపమానంలోని సత్యాలు మాటి మాటికి జ్ఞాపకం చేయబడవలసినంత గంభీరమైనవి. నేను ఈ ప్రసంగం చేసేటప్పుడు బోర్డుమీద బొమ్మలు అంటించే పద్ధతిని ఉపయోగిస్తాను. ప్రసంగ ప్రారంభంలో, పేరు బోర్డుపైన ఉంటుంది. విత్తువాని బొమ్మ మధ్యలో ఉంటుంది. బోర్డును నాలుగు భాగాలుగా విభజిస్తాను.






సూచనలు

[1]ఎవరికి కృతజ్ఞతలు తెలుపాలో తెలియదు. జ్ఞాపకం ఉన్నంతవరకు McGarvey's *Fourfold Gospel* మూలం నుండి అధిక భాగం సేకరించాను. [2]కొన్ని విత్తనములు "త్రోవ ప్రక్కను"పడెను KJV అని ఉంది. [3]ఆయా నేలలకు సంబంధించిన ఉదాహరణలను నీవు చెప్పవచ్చు. [4]నేలలో అనేక రకాల రాళ్లగలదిగా ఉంటుంది కదా, బండపై భాగంలో కొంత మంచి నేల ఉండవచ్చు. [5]J. W. McGarvey and Philip Y. Pendleton, *The Fourfold Gospel or A Harmony of the Four Gospels* (Cincinnati: Standard Publishing Co., 1914) 330. [6]విత్తనం యొక్క తల, చెవి అనే ప్రయోగం మీ ప్రాంతంలో ఉంది. అవసరమైన పదాన్ని ఉపయోగించు. [7]విత్తువాని (ఉపదేశకుని)చే నేల (హృదయం) సిద్ధపరచబడాలి, శుద్ధిచేయబడాలి, అయితే ఉపమానంలో నేల (హృదయం) యొక్క పరిస్థితి మాత్రమే ఆలోచింపబడింది. [8]కొలస్సీ. 1:23 KJV చదువు. [9]కొలస్సీ. 2:7 చదువు. [10]McGarvey and Pendleton, 334 నుండి ఈ ప్రతిపాదన సేకరించబడింది.

[11]శ్రోతలకు అవసరమైనది ఉపయోగించు. [12]"భంగమైన హృదయం" అని చెప్పవచ్చు. [13]ప్రభువునకు "ఫలించడం" అంటె ఏమిటో వివరించు. [14]ఈ యోచనను నీవు వృక్షాలను ఉపయోగించి వివరించవచ్చు. [15]American Heritage Dictionary, 4th ed. (2001), s.v. "fruit." [16]సందర్భ సహితంగా ఉపయోగించు. [17]తప్పిపోయిన క్రైస్తవులు తిరిగి ఎలా రావచ్చునో అపొ. 8:22; యాకోబు 5:16; 1 యోహాను 1:9లను – నీ శ్రోతలను బట్టి ఉపయోగించుకోవచ్చు.